# సాక్షి నారాయణపేట

ఆదివారం । 16 । మార్చి । 2025






**వైభవంగా రథోత్సవం**

మన్యంకొండ అలివేలు మంగతాయారు రథోత్సవం వైభవంగా జరిగింది.

వివరాలు 8లో ▸

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ 6-32 (ఆదివారం సాయంత్రం)

సహర్ 5-00 (సోమవారం తెల్లవారుజామున)

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 39.3 /20.2

ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### మహిళల రక్షణకే షీ టీంలు

**నారాయణపేట: మహిళల రక్షణ కోసమే షీటీంలు, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచే**స్తున్నాయని ఎస్పీ యోగేష్ గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, యువతులు, బాలికలు ఎప్పుడైనా.. ఎక్కడైన ఆకతాయిల వల్ల, మరే విధంగా వేధింపులకు గురైనా వెంటనే షీటీంలు, పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, గృహహింసకు గురైన ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని, విద్యా సంస్థలు, బస్టాండ్, గ్రామాలు, కాలనీలల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు గురైనా, ఉద్యోగం చేసే మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా షీ టీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని తెలిపారు. ఆన్‌లైన్ మాధ్యమాల్లో ఫొటోలు,వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 8712670398 ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

### విద్యార్థులకు ఇబ్బంది కలిగించొద్దు



**నారాయణపేట రూరల్:** ఒంటి పూట బడులు ప్రారంభమైన నేపథ్యంలో ఆర్టీసీ బస్సు సమయాలను విద్యాసంస్థల వేళలకు సరిచేయాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు ఆర్టీసీ డీఎం లావణ్యకు శనివారం వినతిపత్రం అందించారు. జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి దగ్గరలోని పట్టణాలకు విద్యార్థులు చదువుకునేందుకు వస్తున్నారని, వారి సౌకర్యార్థం ప్రభుత్వం ఉచితంగా, రాయితీ పాసులను అందించి బస్సులను నడిపించాలని సూచించినా స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఒంటి పూట బడులు ప్రారంభమైన డీఎం నిర్లక్ష్యంతో శనివారం బస్సుల వేళలను మార్చలేదని విమర్శించారు. రెండు తరగతుల తర్వాత విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంతో ఎంతో నష్టం జరుగుతుందన్నారు. డబ్బు సంపాదనే లక్ష్యంగా పనిచేయడం కాకుండా విద్యార్థుల చదువును దృష్టి పెట్టాలని హితవు పలికారు. విద్యాశాఖ ప్రకటించిన సమయాలకు అనుగుణంగా బస్సుల రాకపోకలను సవరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌస్, వెంకటేష్, నరేష్, అఖిల, మౌనిక, అంజి, సుమిత్ర పాల్గొన్నారు.

### ఎట్టకేలకు మిల్లు యజమాని అరెస్టు

- రూ.3.76 కోట్ల ధాన్యం గోల్‌మాల్

గద్వాల క్రైం: రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ వారు 2021–22 రబీ సీజన్‌లో ధాన్యాన్ని మర ఆడించి ఇచ్చేందుకు ఓ మిల్లుకు 774.33 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించగా.. సదరు మిల్లు యజమాని ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఎట్టకేలకు మిల్లు యజమానిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. గద్వాల సీఐ శ్రీను తెలిపిన వివరాలిలా.. గద్వాల మండలం కాకులారం గ్రామానికి చెందిన క్రిష్టయ్యగౌడ్ అదే గ్రామంలో క్రిష్ణరైస్ మిల్లును ఏర్పాటు చేసుకున్నాడు. అయితే 2021 - 2022 రబీ సీజన్‌లో ఐకేపీ నుంచి 774.33 మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని సివిల్ సప్‌లైశాఖ సీఎంఆర్ నిమిత్తం మిల్లుకు కేటాయించింది. అయితే మిల్లు యాజ మాని మర అడించిన బియ్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా రూ.3.76 కోట్ల సొమ్మును పక్కదారి పట్టించాడు. 27.05.2023న గద్వాల రూరల్ పోలీసు స్టేషన్‌లో మిల్లు యాజమానిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎట్టకేలకు క్రిష్ణరైస్ మిల్లు యాజమాని క్రిష్ణగౌడ్‌ను అదుపులోకి తీసుకుని అలంపూర్ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

# ఆవిష్కరణలకు గుర్తింపు

## పీయూలో పరిశోధనలపై దృష్టి సారించిన అధ్యాపకులు

- ఇప్పటికే కెమిస్ట్రీ విభాగంలో పూర్తిస్థాయి పేటెంట్ హక్కులు
- డిజైన్ విభాగంలో రెండు, యుటిలిటీలో ఒకటి, పరిశీలనలలో మరొకటి
- గుర్తింపు వస్తే పూర్తిస్థాయిలో కొత్త ఆవిష్కరణలకు అవకాశం




పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు బోధనపైనే కాకుండా.. పరిశోధనలపై సైతం దృష్టిసారించారు. గత కొన్నేళ్లుగా సాగుతున్న పరిశోధనలతో పలు అంశాల్లో పేటెంట్ రైట్స్ సైతం సాధించారు. మొత్తం కెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకులు పర్యావరణహిత రీ ఏజెంట్లు, ఎలాంటి కెమికల్స్ లేకుండా సాధారణ పర్యావరణానికి అనుకూలమైన విధానంలో తయారు చేయడం యూనివర్సిటీ చరిత్రలో ఓ మైలురాయి. దీనికి పేటెంట్ రైట్ రావడంతో టీచర్స్ అసోసియేట్ షిప్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ ఫెల్లోషిప్ అధ్యాపకులు చంద్రకిరణ్ ఎంపికయ్యారు. మ్యాథ్స్ విభాగంలో అధ్యాపకులు రిమోట్ కంట్రోల్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ తయారీ, రోలర్ స్టాంప్ తయారీకి డిజైన్ విభాగంలో పేటెంట్ రాగా.. స్ట్రెచింగ్ షీట్‌పై కాసన్ నానోఫ్లూయిడ్స్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పంచే పద్ధతి వంటివి ఇటీవలే ఆవిష్కరించారు. ఇవి పరిశీలన దశలో ఉండగా.. మరో ఆవిష్కరణను ఎంబీఏ అధ్యాపకులు ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్రిడెక్టర్ వంటి పరికరాలు ఆవిష్కరించారు. దీంతో ఇటు అధ్యాపకులు రీసెర్చ్ స్కాలర్స్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ విద్యార్థులు పరిశోధనల అనంతరం ఒక కొత్త యంత్రాల ఆవిష్కరణతో జరిగే ప్రయోజనం వంటి అంశాలపై దృష్టిసారించారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

### కీలకంగా పర్యావరణహిత రీ ఏజెంట్లు



పేటెంట్ రైట్ సర్టిఫికెట్ చూపిస్తున్న అధ్యాపకులు చంద్రకిరణ్, రీసెర్చ్ స్కాలర్ స్వాతి (ఫైల్)

రసాయన పరిశ్రమలు, ట్యాబ్‌లెట్లు, ఇతర పరిశ్రమల్లో కెమికల్స్ తయారు చేసేందుకు రీ ఏజెంట్లు ఎంతో కీలకంగా మారనున్నాయి. ఇందులో రీ ఏజెంట్లు మొదట తయారు చేసేందుకు పెద్ద పరిశ్రమలను స్థాపించడం, పెట్టుబడి, ఇతర పర్యావరణానికి నష్టం చేసే విధంగా ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. కానీ, పీయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు చేసిన ప్రయోగాలు పూర్తిగా పర్యావరణ హితం కానున్నాయి. సాధారణ గది ఉష్ణోగ్రతల వద్ద చిన్న గదుల్లో సైతం రీ ఏజెంట్లను శాస్త్రీయ పద్ధతిలో తయారు చేసే విధానాన్ని కొనుగొనడంతో మూడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం పేటెంట్ రైట్ ప్రకటించింది. ఇందులో అధ్యాపకులు చంద్రకిరణ్, సిద్ధరామగౌడ్, రీసెర్చి స్కాలర్ స్వాతి భాగస్వాములయ్యారు. వీటితోపాటు మరో 20 రీఏజెంట్‌లో పరిశోధనలో ఉన్నాయి.

### రిమోట్ కంట్రోల్‌తో ఆక్సిజన్..

పీయూ మ్యాథ్స్ విభాగంలో పేటెంట్ రైట్స్ దృష్టిసారించింది. ఇందులో డిజైన్ విభాగంలో శ్వాసకోశ రోగులకు ఆక్సిజన్ థెరపీ అందించేందుకు రిమోట్ కంట్రోలర్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ రూపొందించారు. ఇందులో పేషెంట్ ఆరోగ్యం, పరిస్థితి తదితర అంశాలను కాన్సన్‌ట్రేటర్ పరిశీలించిన తర్వాత రోగికి ఆక్సిజన్ అందిస్తుంది. అయితే రోగికి మ్యానువల్ పద్ధతిలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేషన్ ద్వారా ఆక్సిజన్ సరఫరా చేయాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఉండే నేపథ్యంలో కేవలం రిమోట్ కంట్రోల్ ద్వారా ఆక్సిజన్‌ను అవసరం మేరకు అందిస్తే ఇబ్బందులు తప్పనున్నాయి. ఇందులో పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు శంకర్‌రావు, మధు, భారతి, సత్తమ్మ, లిపిక, అరుంధతి పాలుపంచుకున్నారు.



డిజైన్ విభాగంలో పేటెంట్ పొందిన మ్యాథ్స్ అధ్యాపకుడు మధును సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప (ఫైల్)

➪ రోలర్ స్టాంప్ పరికరాన్ని మ్యాథ్స్ విభాగం అధ్యాపకులు మధు ఆవిష్కరించగా.. పేటెంట్ రైట్ లభించింది. గణితం అంటే భయపడే పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ పరికరం ఎంతో ఉపయోగపడనుంది. దీని ద్వారా గణిత ప్రక్రియలను సులభతరం చేసేందుకు అవకాశం ఉంది.

➪ రసాయన శాస్త్రంలో కెమికల్స్ ప్రాసెసింగ్, ఏరో స్పేస్, బయో మెడికల్ ఇంజినీరింగ్ పారిశ్రామిక అనువర్తనాల్లో వేడి, ద్రవ్యరాశి బదిలీలో కీలకపాత్ర పోషిస్తున్న స్ట్రెచింగ్ షీట్‌పై కాసస్ నానో ఫ్లూయిడ్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పెంచే పద్ధతిలో కూడా మ్యాథ్స్ విభాగంలో పరిశోధనలు పూర్తి కాగా పేటెంట్ రైట్ పరిశీలనలో ఉన్నాయి.

### నానో టెక్నాలజీ బ్యాండేజీ..

సాధారణంగా గాయాలు త్వరగా తగ్గేలా సూక్ష్మజీవులను చంపేందుకు వినియోగించే బ్యాండేజీలు కొత్త విధానాన్ని ఆవిష్కరించడంలో పీయూ బాటనీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు శివకుమార్‌సింగ్ సఫలమయ్యారు. సూక్ష్మజీవులను చంపే బ్యాండేజ్‌లో చెట్ల రసాయనాలను వినియోగించి నానోపార్టికల్స్ ఆవిష్కరించారు. వీటి ప్రభావం సూక్ష్మజీవులపై ఎలా ఉంటుందో నిరూపించారు. ఈ ప్రయోగంలో బెంగళూరుకు చెందిన సైంటిస్టులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ ప్రయోగానికి 2023లో పేటెంట్ రైట్ అందుకున్నారు.



శివకుమార్‌సింగ్‌ను సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్ తదితరులు



అర్జున్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్ తదితరులు (ఫైల్)

### కీలకంగా స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్..

పీయూ ఎంబీఏ విభాగంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసే వారికి స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్ భవిష్యత్‌లో కీలక పరికరంగా మారే అవకాశం ఉంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే వారికి మంచి సాధనంగా మారుతుంది. దీని ద్వారా స్టాక్ మార్కెట్‌ను పరిశీలించడానికి ఏఐని వినియోగించనున్నారు. ఇది మార్కెట్ అంచనా వేసేందుకు ఇంటర్నెట్, సోషల్ మీడియాలో ఆర్థికపరమైన వార్తలు, మీడియా కథనాలను అంచనా వేసి ఏ కంపెనీ షేర్ మార్కెట్‌లో లాభాలు గడిస్తాయనే అంశంపై మిషన్ లెర్నింగ్, ఆల్గరిథమ్ ఆధారంగా సమాచారం ఇస్తుంది. ఇది అందించిన సమాచారం మేరకు ఏ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు అనే అంశంపై సమాచారం ఇస్తుంది. ఇందులో పలు కళాశాలలకు చెందిన సురేష్‌కృష్ణ, కన్నమ్మల్, గాయత్రి, అర్జున్‌కుమార్, కిరుబదేవి, సుమందీశ్వర్, రాజామణి పాల్గొనగా.. పీయూ అధ్యాపకులు అర్జున్‌కుమార్ కీలకంగా వ్యవహరించారు.

### ప్రాధాన్యం ఇస్తున్నాం..



యూనివర్సిటీలో అధ్యాపకులు, ఇటు రీసెర్చ్ స్కాలర్ ఎంతో ఉత్సాహంగా పరిశోధనలపై దృష్టి సారిస్తున్నారు. ఇటీవల కొన్ని పేటెంట్లు కూడా వచ్చాయి. దీని ద్వారా పీయూకు ప్రాజెక్టులు, రీసెర్చ్ పరమైన అంశాల్లో ముందంజ వేస్తున్నాం. నిర్మాణంలో రీసెర్చ్ ఫెసిలిటీ భవనం ఉంది. అది అందుబాటులోకి వస్తే పీయూ రీసెర్చ్ హబ్‌గా మారనుంది. అందులో పూర్తిస్థాయిలో ల్యాబ్‌లో అధునాతన ప్రయోగ పరికరాలు అందుబాటులోకి తీసుకువస్తాం.

– శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పాలమూరు యూనివర్సిటీ

### మరింత ఊతం..



యూనివర్సిటీలో రీసెర్చ్‌తో పాటు కొత్త ఆవిష్కరణలకు అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ కృషిచేయడం గొప్ప విషయం. భవిష్యత్‌లో రీసెర్చ్ ఫెసిలిటీ అందుబాటులోకి రానుంది. ఇంజినీరింగ్ కళాశాలకు రెగ్యులర్ అధ్యాపకులు రానున్నారు. దీంతో మరింత రీసెర్చ్ పెరగనుంది. పలు ప్రతిష్టాత్మక సంస్థలతో ఎంఓయూ చేసుకునేందుకు చర్చలు జరుగుతున్నాయి.

– మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పీజీ కళాశాల, మహబూబ్‌నగర్

# ఒత్తిడి అధిగమిస్తేనే విజయం



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కొత్తపల్లి: విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి పరీక్షలు రాయాలని.. ఒత్తిడిని అధిగమిస్తేనే పరీక్షల్లో విజయం సాధించవచ్చునని.. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో పదికి పది జీపీఏ సాధించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం మండలంలోని నిడ్జింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదో తరగతి విద్యార్థుల గతేడాది ఫలితాలను హెచ్‌ఎంను అడిగి తెలుసుకొని.. ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని, ఈమేరకు విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో తీర్చిదిద్దాలని సూచించారు. ఆయా సబ్జెక్టుల్లో వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మరికొద్ది రోజుల్లో జరగనున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చేలా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం అల్పాహారం సరైన సమయానికి అందుతుందా లేదా, నాణ్యత ఎలా ఉంది అంటూ విద్యార్థులను ఆరా తీశారు. నాణ్యత లేకుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థుల సబ్జెక్ట్ విషయాలపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ గురించి ఆరా తీస్తూ.. విద్యార్థులతో ముఖాముఖి ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. ఆవరణలోని బయో పార్క్‌లో నాటిన మొక్కలు, వాటి పరిరక్షణ గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులు సమేకమై పూర్తి స్థాయిలో పార్కును సంసిద్ధం చేయాలని, అందుకు తగునీటి వసతిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈక్రమంలో పాఠశాలకు బోరు వేయించాలని ఉపాధ్యాయులు కలెక్టర్‌ను కోరగా.. ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శిని తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావ్, తహసీల్దార్ జయరాములు, శ్రావణ్, గ్రామ కార్యదర్శి వెంకటేష్, హెచ్‌ఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం ముందుకెళ్తున్నాం

నర్వ: మంచినీటి ఇబ్బంది తీర్చుతానని మాటిచ్చానని.. ఆ మాట ప్రకారం ముందుకెళ్తున్నామని ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం ఆమె తన నిధుల నుంచి రూ.5 లక్షలతో నాగిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేయబోయే ఆర్‌ఓ ప్లాంట్‌కు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని అందించిన దాత తిమ్మారెడ్డిని ఆమె శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామ బీజేపీ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన నూతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి మరమ్మతు చేపట్టి సాగునీరందించాలని, గ్రామం నుండి ఉంద్యాల వరకు బీటీ రహదారిని, గ్రామంలో హైమాస్ట్ లైట్స్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తుల తరఫున బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ఎంపీని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆమె తన నిధులు ద్వారా ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. అనంతరం బీజేపీ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు నర్సన్‌గౌడ్, కర్ని స్వామి, కుర్వసత్యం, మేర్వరాజు,నర్వ మండల అధ్యక్షులు అజిత్‌సింహారెడ్డి, మారుతి, రామంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.




నాగిరెడ్డిపల్లిలో ఆర్‌ఓ ప్లాంట్‌కు భూమిపూజ చేస్తున్న ఎంపీ డీకే అరుణ

# 'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి



జాజాపూర్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

నారాయణపేట రూరల్: జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈఓ గోవిందరాజు సూచించారు. మండలంలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీచర్లు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి, మధ్యాహ్న భోజన నిర్వహణపై వివరాలు సేకరించారు. అనంతరం పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను పలు సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను అడిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశలో టెస్ట్ గేమ్ చేజర్ అని, ప్రతి ఒక్కరూ తప్పకుండా మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఒత్తిడికి గురికాకుండా యోగ, ధ్యానం చేయాలన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకుంటూ సరిపడా నిద్ర పోవాలన్నారు. సందేహాలను నివృత్తి చేసుకొని భయం లేకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఎలక్ట్రానిక్ వస్తువులను, ఇతర పరికరాలను కేంద్రంలోకి తీసుకొని వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఎం భారతి, డీఎస్‌ఓ భాను ప్రకాష్, ఎండీఎం ఇంచార్జ్ యాదయ్య శెట్టి పాల్గొన్నారు.

### ఏఐతో చదువుపై ఆసక్తి పెంపు

తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన కంటే కంప్యూటర్ ల్యాబ్ లో విద్యార్థులకు అందిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విధానంలో చదువు పట్ల మరింత ఆసక్తి పెంపొందుతుందని డీఈఓ గోవిందరాజు అన్నారు. రెండో విడత ఏఐ విధానం మండలంలోని జాజాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెనుకబడిన విద్యార్థులతో పాటు చురుకుగా ఉన్న పిల్లలకు వారి స్థాయిని బట్టి విద్యాబోధన జరుగుతుందని, తద్వారా విద్యార్థులందరూ నేర్చుకునేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. విద్యార్థుల గైర్హాజరు శాతం తగ్గి రెగ్యులర్ గా పాఠశాలకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, టీచర్లు బాలకృష్ణ, విశ్వనాథ్ రెడ్డి, రజిత, గీత పాల్గొన్నారు.

# హక్కులపై అవగాహన ఉండాలి




మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి

**నారాయణపేట:** వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. మానవ జీవితంలో వస్తు వినియోగం తప్పనిసరి అని, ఏదైనా ఒక వస్తువు కొని, ఆ వస్తువు నకిలీ లేదా నాసిరకం అయితే ఆ వస్తువుని అమ్మిన వ్యాపారి పై లేదా ఉత్పత్తిదారులపై వినియోగదారుల ఫోరంలో కేసు వేసి నష్టపరిహారం పొందవచ్చన్నారు. డీఏఓ జాన్ సుధాకర్ మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల చట్టాన్ని క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని అన్నారు. ఫోరం సభ్యుడు అశోక్, హజమ్మ మాట్లాడుతూ.. పుట్టిన పిల్లాడి నుంచి చనిపోయే వరకు అందరూ వినియోగదారులే అవుతారని, కల్తీ రహిత సమాజాన్ని నిర్మించాలంటే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. బంగారం నుంచి మొదలుకొని పాలిథిన్ కవర్ వరకు ప్రతీ వస్తువుకు అది మంచిదా? లేక నకిలీదా అని తెలిపేందుకు హాల్ మార్క్, ఐఎస్ఐ లాంటి గుర్తులు ఉంటాయని, వాటిని చూసిన తర్వాతే మనం కొనుగోలు చేయాలని వారు సూచించారు. సమావేశంలో పలువురు ఫోరం సభ్యులు, రేషన్ డీలర్లు వినియోగదారుల హక్కుల చట్టం తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో చర్చించిన అంశాలన్నిటిని కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బాల్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం మాసన్న, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### చింతపండు క్వింటాల్ రూ.13,011



నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చింతపండు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.13,011, కనిష్ఠంగా రూ.5,500 ధర పలికిం ది. అలాగే, తెల్ల కందులు గరిష్ఠం రూ.7వేలు, కనిష్ఠం రూ.6,900, ఎర్ర కందులు గరిష్ఠం రూ.7,081, కనిష్ఠం రూ.5,839, అలసందలు గరిష్ఠం రూ.7,113, కనిష్ఠం రూ.7,050, జొన్నలు గరిష్ఠం రూ.4,655, కనిష్ఠం రూ.2,600, వేరుశనగ గరిష్ఠం రూ.6,239, కనిష్ఠం రూ.4,150, పెసర గరిష్ఠంగా రూ.7,571, కనిష్ఠంగా రూ.7,455 ధరలు పలికాయి.

# కొనసాగుతున్న సహాయక చర్యలు



- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో లభ్యం కాని కార్మికుల ఆచూకీ
- కనీసం ఆనవాళ్లు కూడా లభించని వైనం
- హైడ్రాలిక్ పవర్డ్ రోబో పనితీరు పైనే ఆశలు

వివరాలు 8లో ▸

# వైభవం.. అలివేలుమంగ రథోత్సవం


రథంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

- ఘనంగా గరుడవాహన సేవ
- భక్తి పారవశ్యంతో పులకించిన భక్తులు

**మహబూబ్‌నగర్ రూరల్:** మన్యంకొండ అలివేలు మంగతాయారు రథోత్సవం (విమాన రథోత్సవం) శుక్రవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా సాగింది. ముందుగా శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రోచ్చారణల నడుమ గర్భాలయం నుంచి ప్రధాన ద్వారం మీదుగా ఆలయ ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం రంగురంగుల పూలు, విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో ముస్తాబుచేసిన రథంపై ఉంచారు. రథం ముందు కుంభం పోసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తుల గోవింద నామస్మరణలు చేస్తూ ముందుకు లాగారు. సాంప్రదాయ రీతిలో ఆలయం ముందున్న దేవగుండు వద్దకు లాగి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. రథోత్సవానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. బంగారు ఆభరణాలు, కాగడాలు, విద్యుద్దీపాల వెలుతురులో స్వామి, అమ్మవార్లు ధగధగ మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మళ్లీ ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై గర్భగుడి తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రత్యేక అభిషేకం, బలిహరణం, హోమం తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి.


అలంకరణలో ఉత్సవమూర్తులు

### అశ్వవాహనసేవ..

అలివేలు మంగతాయారు ఆలయంలో శనివారం రాత్రి అశ్వవాహనసేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తుల హరినామస్మరణ, పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురులో అశ్వవాహనం ముందుకు కదిలింది. స్వర్ణాభరణాల అలంకరణలో వేంకటేశ్వరస్వామి సమేత అలివేలు మంగతాయారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. విశేష దినోత్సవం సందర్భంగా గుట్టపైనున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలక మండలి సభ్యులు వెంకటాచారి, సురేందర్, గోవిందు, అలువేలమ్మ, సుధ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

- ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం, పూర్ణాహుతి, అవభృతస్నానం, రాత్రికి నాగబలి (నాగవెల్లి), ద్వాదశ ఆరాధన, సప్తావరణాలు, మహా ఆశ్వీరచనం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. దీంతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి.

# రమణీయం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

- కందూర్‌లో మార్మోగిన శివనామస్మరణ
- భారీగా తరలివచ్చిన భక్తజనం


అలంకరణలో స్వామివారి మూల విగ్రహం


రథోత్సవానికి హాజరైన భక్తజనం

**అడ్డాకుల:** మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం అర్ధరాత్రి రమణీయంగా సాగింది. ముందుగా గ్రామం నుంచి రామలింగేశ్వరస్వామి వెండి ముఖం, నాగపడగను మంగళవాయిద్యాలు, డప్పుచప్పుళ్ల నడుమ బాణసంచా కాలుస్తూ భక్తుల శివనామస్మరణతో ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ పూజారులు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయం వెలుపలకు తీసుకొచ్చి అలంకరించిన రథంపై ఉంచారు. తర్వాత రథం ముందు పోలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి రథాంగ హోమం చేసి హారతులిచ్చారు. శనివారం తెల్లవారుజామున అశేష భక్తజనం శివనామస్మరణ చేస్తూ మేళతాళాల మధ్య స్వామివారి రథాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. రథం ముందు భక్తులు భజనలు, కోలాటాలు చేస్తూ అందరిని అలరించారు. రథోత్సవానికి వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ, గ్రామపెద్దలు నాగిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌శర్మ, దామోదర్‌రెడ్డి, రాములు, బుచ్చన్నగౌడ్, దేవన్నయాదవ్, మనోహర్, సత్తిరెడ్డి, అర్చకులు యాదగిరిశర్మ, తాళ్లపాక రామలింగశర్మ, శివశర్మ, మణికంఠశర్మ, రేవంత్‌శర్మ, వినయ్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**అచ్చంపేట రూరల్:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వ్యక్తిపై శనివారం అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని పాతబజార్‌లో సివిల్‌సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా... అనుమానాస్పదంగా ఓ ఆటోలో 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యం ఎవరివని విచారించగా ఎండీ ఉస్మాన్ అనే వ్యక్తి తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకుంటాడని తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. కాగా కొంతమంది అధికార పార్టీ నాయకులు, అధికారులు కేసు నుంచి అసలు సూత్రధారులను తప్పించే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం.

## క్లుప్తంగా

### సంప్‌లో పడి చిన్నారి మృతి


నాన్సీ(ఫైల్)

**బల్మూర్:** అప్పటివరకు అందరిని నవ్విస్తూ ఆడుకుంటున్న చిన్నారి సంప్‌లో పడి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని కొండనాగుల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చింత మహేష్, సుస్మిత దంపతులు. వీరికి నాన్సీ(2) అనే కూతురు ఉంది. పక్కనే ఉన్న తాత బాలయ్య ఇంటికి ఆడుకుంటూ వెళ్లింది. అక్కడ చిన్నారిని ఎవరూ గమనించకపోవడంతో ఇంటి ముందు ఉన్న సంప్‌లో పడింది. కొంత సేపటికి గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని సంప్‌లో నుంచి తీయగా అప్పటికే నీళ్లు మింగి ఊపిరాడక మృతి చెందింది. చిన్నారి మృతితో ఆకుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

### బావిలో పడి వ్యక్తి..


చంద్రయ్య (ఫైల్)

**మిడ్జిల్:** ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మిడ్జిల్ మండలం వేముల గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. వేములకు చెందిన రేవల్లి చంద్రయ్య (50) గురువారం రాత్రి గ్రామంలో నిర్వహించిన కాముడి దహనం కార్యక్రమానికి వెళ్లాడు. అర్ధరాత్రి 1గంటకు కాముడి దహనం ముగిసిన అనంతరం బుడిద తీసుకుని వస్తుండగా.. గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శనివారం గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడికి భార్య కళమ్మ, కుమారుడు శివకుమార్ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

### బైక్ అదుపు తప్పి వ్యక్తి..


రవీంద్రనాథ్‌రెడ్డి (ఫైల్)

**ఉండవెల్లి:** మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి(38) అనే వ్యక్తి పెద్దపోతులపాడు స్టేజీ సమీపంలో అదుపు తప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై అలంపూర్ చౌరస్తా నుంచి స్వగ్రామమైన చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి కిందపడినట్లు చెప్పారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

### మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

**జడ్చర్ల:** మండలంలోని కోల్‌బాయితండాకు చెందిన పాత్లావత్ శారద(45) తన ఇంటిలో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. కోల్‌బాయితండాకు చెందిన శారద భర్త శంకర్ ఆరేళ్ల క్రితం మృతిచెందగా ఆమె తన కుమారుడు సంతోష్, కోడలు జ్యోతిలతో కలిసి జీవిస్తుంది. అయితే కొడుకు, కోడలు తనను వేధిస్తున్నారని తన తండ్రి మునావత్ తథ్యుతో వాపోయింది. ఈ క్రమంలోనే శారద ఆత్మహత్యకు కుమారుడు, కోడలు కారణమని అనుమానంతో శనివారం ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# కొనసాగుతున్న సహాయక చర్యలు


సొరంగంలోకి తాగునీరు తీసుకెళ్తున్న సహాయక బృందాలు

**ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో లభ్యం కాని కార్మికుల ఆచూకీ**

- కనీసం ఆనవాళ్లు కూడా లభించని వైనం
- హైడ్రాలిక్ పవర్డ్ రోబో పనితీరుపైనే ఆశలు
- డీ1 జోన్ ప్రాంతంలో బలహీనంగా పైకప్పు
- 22 రోజులు శ్రమిస్తున్న సహాయక బృందాలు


సొరంగంలోకి లోకో ట్రైన్‌లో వెళ్తున్న అన్వి రోబోటిక్ సంస్థ బృందం

**అచ్చంపేట/ ఉప్పునుంతల:** శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల కోసం అడుగడుగునా అన్వేషిస్తున్నారు. 22 రోజులు గడుస్తున్నా ఇంత వరకు వారి ఆచూకీ దొరకలేదు. మానవ ప్రయత్నంలో కొంత ఇబ్బందులు ఎదురవుతుండటంతో ఏఐ టెక్నాలజీ ద్వారా అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపు, వాక్యూమ్ ట్యాంకు ద్వారా సహాయక చర్యలు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం వాటిని సొరంగం వద్ద సాంకేతిక పరిజ్ఞానంతో ఇన్‌స్టాలేషన్ చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. మరోవైపు సాంకేతిక సమస్యలతో రోబో యంత్రాల పనితీరు ఇంకా ప్రారంభం కాలేదు. డీ2 ప్రదేశం నుంచి డీ1 వరకు సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్ ఇతర సహాయక బృందాలు మట్టి, బురద తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. టీబీఎం ఎర్త్ కట్టర్ ఉన్న ప్రాంతం పూర్తిగా 40 అడుగుల మేర కూరుకుపోయింది. అక్కడి వరకు మనుషులు వెళ్లి సహాయక చర్యలు చేపట్టడం ఇబ్బందికరంగా ఉంది. టీబీఎం విడి భాగాలను ప్లాస్మా కట్టర్‌తో తొలగిస్తున్నారు. డీ1 డేంజర్ జోన్ ప్రాంతంలో పైకప్పు బలహీనంగా ఉండటంతో కాంక్రీట్ సెగ్మెంట్ కూడా పడిపోయే పరిస్థితి గమనించి సింగరేణి గనుల్లో ఉపయోగించే టైగర్ కారడ్స్ కలప దుంగలను సపోర్టుగా చేసుకుంటూ తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు వీటిని నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. వీటికి సుమారు 40 టన్నుల బరువు ఆపగలగే శక్తి ఉంది. ప్రమాదం జరిగే ముందు శబ్దం వస్తుందని, దీని వల్ల కార్మికులు సురక్షితంగా తప్పించుకునే అవకాశం ఉంటుందని సింగరేణి కార్మికులు వెల్లడించారు. డీ1 ప్రదేశానికి వెళ్లడానికి ఇంకా 30 మీటర్ల మట్టిని తొలగిస్తే సహాయక బృందాలు అక్కడికి చేరకుంటాయి. డీ1 వద్దకు చేరుకుంటే తప్ప తప్పిపోయిన కార్మికుల ఆచూకీ లభ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. డీ1 వద్ద పూర్తిస్థాయిలో మట్టిని తీసేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. మరో రెండు, మూడు రోజుల్లో ఆచూకీ లభ్యమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

### మార్గనిర్దేశనం చేస్తున్నాం..

ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం సొరంగంలోని పరిస్థితులపై కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తోపాటు సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సొరంగంలో జరుగుతున్న పురోగతిపై సమీక్షించి అవసరమైన మార్పులను అమలు చేస్తూ మార్గనిర్దేశనం చేస్తున్నట్లు వెల్లడించారు. సహాయక బృందాల మధ్య సమన్వయంతో పనులు చేపడుతున్నామని, మరింత వేగవంతం చేసేందుకు అత్యాధునిక రోబోటిక్ పద్ధతులను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపుతో అనుసంధానమైన వాక్యూమ్ ట్యాంకు ఉపయోగించి నీటితో కూడిన బురద, మట్టిని తొలగించనున్నట్లు తెలిపారు. సొరంగంలోని నీటిని తొలగించేందుకు డీ-వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా ఆధునిక పరికరాలు ఉపయోగించి శరవేగంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా ఆక్సిజన్ సరఫరా, వైద్యసేవలు, ఆహారం, మంచినీరు వంటి అవసరాలను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రాధాన్యంగా సహాయక బృందాల భద్రతకు దృష్టిలో పెట్టుకుని అత్యవసర అవసరాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. అనంతరం లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంక్‌తో కూడిన మిషన్ పనితీరు పరిశీలించారు.

# పండ్లకు భలే గిరాకీ

- ఉపవాసదీక్షలతో పెరిగిన వినియోగం
- రిటైల్‌గా జోరందుకున్న వ్యాపారం
- అమాంతంగా పెరిగిన ధరలు


దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** రంజాన్ మాసంలో పండ్లకు గిరాకీ ఎక్కువగా ఉంటోంది. మిగతా రోజుల కంటే ఈ మాసంలో పండ్ల వినియోగం అధికంగా ఉండడంతో ధరలు కూడా అంతేస్థాయిలో ఉన్నాయి. అరటి పండ్ల డజన్ ధర గత వారంతో పోలిస్తే రూ.5 నుంచి రూ.10 వరకు పెరిగింది. ద్రాక్ష పండ్లు అయితే కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ద్రాక్ష పండ్ల ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. రంజాన్ మాసంలో ఎక్కువగా వినియోగించే కర్బుజా (పుచ్చకాయ) పండు కిలో రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నారు. రిటైల్ మార్కెట్లో పండ్ల విక్రయాలు జోరందుకున్నాయి. రంజాన్ ఉపవాసదీక్షలో ముస్లింలు రోజు సాయంత్రం ఇఫ్తార్ వేళ పండ్లు ఎక్కువగా తీసుకుంటారు. యాపిల్, ఖర్జూర, పుచ్చకాయలు, పైనాపిల్, దానిమ్మ, ద్రాక్ష, బత్తాయి, బొప్పాయి, అరటి, సపోట వంటి పండ్ల వినియోగం పెరగడంతో వీటి ధరల్లో రోజురోజుకు మార్పు కనిపిస్తుంది. ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులకు భారీఎత్తున పండ్లు అవసరమవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పండ్ల ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా, జనరల్ ఆస్పత్రి, న్యూటౌన్, క్లాక్‌టవర్, అంబేడ్కర్ చౌరస్తా, పద్మావతికాలనీతోపాటు ఇతర ప్రాంతాల్లో పండ్ల స్టాళ్లను ఏర్పాటు చేశారు. రూ.20 నుంచి 25 వరకు ఉన్న యాపిల్ రంజాన్ మాసంలో రూ.30 నుంచి 35 వరకు, ఆరెంజ్ పండ్లు డజన్ ప్రకారం రూ.180 నుంచి 200 వరకు అమ్ముతున్నారు.

**మార్కెట్లో వివిధ రకాల పండ్ల ధరలు**

| | |
|---|---|
| యాపిల్ | రూ.25-30(ఒకటి) |
| ద్రాక్ష | రూ.80-100(కిలో) |
| దానిమ్మ | రూ.25-30(ఒకటి) |
| బత్తాయి | రూ.15-20(ఒకటి) |
| బొప్పాయి | రూ.50-60 (కిలో) |
| ఖర్బూజ | రూ.20-25 (కిలో) |
| అరటి | రూ50-60(డజన్) |
| సపోట | రూ.40-50 (కిలో) |

### ధరలు అందరికీ అందుబాటులో ఉండాలి



రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సందర్భంగా పండ్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈసారి కూడా పండ్ల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. పెరిగిన ధరలతో పండ్లను కొనుగోలు చేయలేని పరిస్థితి. పండ్ల ధరలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటే బాగుంటుంది.
– జహంగీర్‌బాబా, సద్దల్‌గుండు, మహబూబ్‌నగర్

# దారిదోపిడీకి యత్నించిన ముఠా అరెస్ట్





వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ , స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- 10 తులాల బంగారం, 22 తులాల వెండి ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిననాగర్‌కర్నూల్ ఎస్పీ

**నాగర్‌కర్నూల్ క్రైం:** జల్సాలకు అలవాటుపడి దారి దోపిడీకి యత్నించిన ఓ ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. వనపర్తికి చెందిన బొల్లెమోని బాబు, బొల్లెమోని అంజి, పుట్టపాకుల శ్రీకాంత్, హైదరాబాద్‌కు చెందిన నందిమళ్ల హరిగణేశ్, యాత రవి, పెంట్లవెల్లికి చెందిన గిరిధర్‌నాయుడు, సాయికుమార్, హరికృష్ణ, అఖిల్ జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతుండేవారు. పెంట్లవెల్లికి చెందిన రాజవర్ధన్, వెంకటేశ్వర్లు, రమేష్, రాఘవేంద్రాచారి బంగారు వ్యాపారులు. వీరంతా ఈ నెల 6న బంగారు కొనుగోలుకు హైదరాబాద్ బయలుదేరారు. నిందితుడు సాయికుమార్ ఈ సమాచారాన్ని బొల్లెమోని బాబుకు అందించడంతో పాటు హరికృష్ణ, గిరిధర్ నాయుడుకు ఓ అద్దె కారు, సెల్‌ఫోన్ అప్పగించి బంగారు వ్యాపారస్తుల కారు వెంటే వెళ్తూ ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ఆ వ్యాపారులు హైదరాబాద్‌లోని కాళీకమాన్ వద్ద బంగారు కొనుగోలు చేసి బయలుదేరగా నిందితులు మిగతా వారిని అప్రమత్తం చేయడంతో పాటు వారి వెంటే వచ్చారు. కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి శివారు కేఎల్‌ఐ వంతెన వద్ద స్వామి, అంజి రాళ్లు అడ్డుపెట్టడంతో పాటు సిమెంట్ దిమ్మెలను, అఖిల్ తల్వార్‌ను చేతిలో పట్టుకోవడంతో పాటు హరిగణేష్, రవి, శ్రీకాంత్ రోడ్డు పక్కన నిలిచి ఉన్నారు. బంగారు వ్యాపారుల కారు అక్కడికి చేరుకోగానే నిందితులు కారుపై సిమెంట్ దిమ్మెలతో దాడి చేసేందుకు యత్నించగా అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా అక్కడి నుంచి వేగంగా తప్పించుకొని వెళ్లిపోయారు. బంగారు వ్యాపారి రాజవర్ధన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి కొల్లాపూర్‌లో పెట్రోల్‌బంక్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా బొల్లెమోని బాబు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించడంతో పాటు మిగతా వారి సమాచారం ఇవ్వడంతో ఏడుగురిని అరెస్టు చేశారు. వీరంతా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 24 చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి వేర్వేరు దొంగతనాలకు సంబంధించి 10 తులాల బంగారు, 22 తులాల వెండి ఆభరణాలు, దారి దోపిడీకి యత్నించిన కారు, రెండు మోటారు సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని.. కోర్టు అనుమతితో మరోమారు పోలీస్ కస్టడీకి తీసుకొని విచారిస్తామని చెప్పారు.

## షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

రూ. 3లక్షల ఆస్తినష్టం

**మక్తల్:** షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధమైన ఘటన మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఊట్కూరు మండలం తిప్రాస్‌పల్లికి చెందిన అశోక్ మక్తల్‌లోని సంగంబండ రోడ్డులో బట్టల షాపు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి 8 గంటలకు షాపును మూసివేసి ఇంటికి బయలుదేరారు. అతడు వెళ్లిన కొద్ది సేపటికే షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అశోక్ అక్కడికి చేరుకొని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే దుకాణంలోని సగానికి పైగా వస్త్రాలు కాలిపోయాయి. దాదాపు రూ. 3లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. దగ్ధమైన షాపును సీఐ రాంలాల్, ఎస్‌ఐ బాగ్యలక్ష్మీరెడ్డి పరిశీలించారు.


దగ్ధమైన వస్త్ర దుకాణం

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**బిజినేపల్లి:** మండలంలోని లట్టుపల్లిలో కృష్ణమోహన్ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న కృష్ణమోహన్ ఇంటికి తాళం వేసి శుక్రవారం యాదాద్రికి వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా మూడున్నర తులాల బంగారం, రూ.50 వేలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## క్లుప్తంగా

### నిలువురాళ్ల గుర్తింపునకు విశ్వప్రయత్నం



కృష్ణా: మండలంలోని నిలువురాళ్లకు యునెస్కో గుర్తింపుతో పాటు ప్రపంచ దేశాలు వాటిని గుర్తించేందుకు కొంతకాలంగా విశ్వప్రయత్నం చేస్తున్నట్లు జై మక్తల్ ట్రస్ట్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముడుమాల్ నిలువురాళ్ల చరిత్ర తెలుసుకున్న తర్వాత పురావాస్తుశాఖ వారితో పాటు ప్రభుత్వంతో పలుమార్లు చర్చించినట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డిని కలిసి యునెస్కో గుర్తింపునకు ప్రయత్నించినట్లు తెలిపారు. అదే విధంగా పలు దేశాల ప్రతినిధులతో ఈ నిలువురాళ్ల చరిత్రను వారికి తెలియజేసినట్లు వివరించారు. ఈ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ, స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రోత్సాహంతో యునెస్కో గుర్తింపునకు ప్రాథమిక ప్రపంచ వారసత్వంగా గుర్తించినట్లు తెలిపారు. ఇకపై కూడా తమ ప్రయత్నం కొనసాగిస్తామన్నారు. యునెస్కో గుర్తింపు వచ్చే వరకు తాము కృషి చేస్తామని అన్నారు.

### పాఠశాల తనిఖీ

**ఊట్కూరు:** మండలంలోని పెద్దపొర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం తహసీల్దార్ చింతరవి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్ వెంట హెచ్ఎం నర్సింగప్ప, ఉపాధ్యాయుడు కృష్ణ ఉన్నారు.

### బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

**కృష్ణా:** మండలంలోని ముడుమాల్ గ్రామంలో ఉన్న నిలువురాళ్లను ఆదివారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఉన్నతాధికారులు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లను శనివారం సీఐ రాంలాల్ పరిశీలించారు. మంత్రి పర్యటన సందర్భంగా ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలు, బందోబస్తుపై సిబ్బందికి సూచనలు చేశారు. సీఐ వెంట ఏఎస్ఐ సురేంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ, నాయకులు బస్వరాజ్, తమ్మప్ప, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

### నేడు నిరసన కార్యక్రమం

**నారాయణపేట:** దళిత నాయకులపై బీఆర్ఎస్ వైఖరిని ఖండిస్తూ ఆదివారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని మండలాల, పట్టణాల్లో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను హనం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఎస్సీసెల్, బీసీసెల్, మైనార్టీసెల్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని బీఆర్ఎస్ తీరును ఎండగట్టాలని సూచించారు.

### ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ధన్వాడ:** స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రానికి వచ్చిన శివయాదవ్‌ను స్థానిక నాయకులు శాలువాతో సన్మానించారు. మాజీ సర్పంచ్ అరుణశ్రీ, మాజీ వైస్‌ఎంపీపీ ఉదయభాను పాల్గొన్నారు.

### బస్సులు లేక అవస్థలు

**నారాయణపేట రూరల్:** ఒంటిపూట బడుల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. శనివారం జిల్లావ్యాప్తంగా ఏ ఒక్క గ్రామానికి కూడా ఆర్టీసీ బస్సు ఒంటిపూట బడి వేళలకు వెళ్లలేకపోయాయి. నారాయణపేట డిపో అధికారులు రెండు పూటల బడులకు సంబంధించిన సమయానికే బస్సులను నడిపించడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా గ్రామాల నుంచి విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో బడులకు చేరుకున్నారు. మరికొందరు బడికి రాలేక ఇంటికి వెళ్లిపోయారు. దీంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో హాజరు శాతం సగానికి పడిపోయింది. అదే విధంగా పాఠశాల సమయం ముగిసిన తర్వాత విద్యార్థులు సొంతూర్లకు వెళ్లడానికి బస్సులు లేక అవసోపాలు పడ్డారు.

### పేకాట స్థావరంపై దాడి

**నారాయణపేట:** మండలంలోని శాసన్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించి.. ఐదుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు, రూ. 2,400 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నారాయణపేట, శాసన్‌పల్లి గ్రామాలకు చెందిన వ్యక్తులు పట్టుబడగా.. పోలీస్‌స్టేషన్‌కు తరలించి గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# రైతు కష్టం.. పశువుల పాలు



నాగంపల్లి శివారులో వదిలేసిన వరిపంటను మేస్తున్న పశువులు

- వట్టిపోతున్న బోరుబావులు
- నీరు లేక ఎండుతున్న వరిపైరు
- చేసేది లేక పశువులకు మేతగా వదులుతున్న రైతులు

**మద్దూరు:** ఆరుగాలం కష్టించి పంటలు పండించే అన్నదాతను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. బోరుబావుల ఆధారంగా యాసంగిలో వరిపంట సాగుచేసిన రైతులు నీటి గోస పడుతున్నారు. వేసవి ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే భూగర్భ జలమట్టం పడిపోవడంతో బోరుబావులు వట్టిపోతున్నాయి. దీంతో వ్యయప్రయాసాలకోర్చి సాగుచేసిన వరిపంటకు నీరందించే పరిస్థితి లేకుండా పోతోంది. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరిపంట రైతుల కళ్లెదుటే ఎండిపోతోంది. ఇక చేసేది లేక రైతులు ఎండిన వరిపంటను పశువులకు వదిలేస్తున్నారు.

**12,408 ఎకరాల్లో వరిసాగు..**

ఉమ్మడి మద్దూరు మండలంలో సాగుయోగ్యమైన భూమి 43,329 ఎకరాలు ఉంది. యాసంగి సీజన్‌లో బోరుబావుల కింద 11,406 మంది రైతులు



మద్దూరులో ఇలా..

12,408 ఎకరాల్లో వరిసాగు చేశారు. అయితే బోరుబావుల్లో నీటిమట్టం పడిపోవడంతో దాదాపు 3వేల ఎకరాల్లో వరిపంటను పశువుల మేతగా వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు రైతులు ఎలాగైనా పంటను కాపాడుకోవాలని కొత్తగా బోరుడ్రిల్లింగ్ చేయిస్తున్నారు. ఇందుకోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే పంట పెట్టుబడి కోసం అవస్థలు పడిన రైతులకు కొత్తగా బోరుడ్రిల్లింగ్ చేయించడం మరింత భారంగా మారుతోంది. చిన్నా, సన్నకారు రైతులు చేసేదిలేక వరిపంటను వదిలేస్తున్నారు.

**విధిలేని పరిస్థితుల్లో..**

యాసంగిలో సాగుచేసిన వరిపంట చేతికి అందాలంటే మరో రెండు నెలల సమయం కావాలి. వేసవి ప్రారంభంలోనే బోరుబావుల్లో నీటిమట్టం అడుగంటిపోవడంతో వరిపంట సాగు ప్రశ్నార్థకంగా మారింది. కొందరి రైతుల బోరుబావులు పూర్తిగా వట్టిపోవడంతో విధిలేని స్థితిలో పశువులు, గొర్రెలకు మేతగా వదిలేస్తున్నారు. రానున్న రోజుల్లో సాగునీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉండటంతో మరిన్ని ఎకరాల్లో పంట పండే అవకాశం లేదని అధికారులే చెబుతున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

**మూడెకరాలు ఎండింది..**



రెండు బోర్లు మంచిగా నీరు పోస్తున్నాయని మూడెకరాల్లో వరిపంట వేశాను. వారం రోజుల్లోనే రెండు బోర్లలో నీటిమట్టం తగ్గడంతో ఎకరం పొలం వదిలేశారు. రెండు ఎకరాలకు మాత్రమే నీరు పారించాను. ప్రస్తుతం బోరుబావులు పూర్తిగా వట్టిపోవడంతో మూడెకరాల వరి పొలాన్ని వదిలేయాల్సి వచ్చింది.

– వెంకట్రాములు, రైతు, నాగంపల్లి

**రూ. 50వేలు నష్టపోయా..**



బోరుబావి నుంచి పుష్కలంగా నీరు వస్తున్నాయని ఎకరన్నర పొలంలో వరి సాగు చేశాను. దాదాపు రూ. 50వేలు పెట్టుబడి పెట్టాను. వారం రోజుల నుంచి బోరుబావి నీరు రాకపోవడంతో పంట ఎండిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– జీడీ హుస్సేనప్ప, రైతు, మద్దూరు

### కాల్వ నీటి కోసం ఎదురుచూపులు

**మాగనూర్:** సంగంబండ కుడి లోలెవల్ కెనాల్ ద్వారా వచ్చే సాగునీటి కోసం ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. సంగంబండ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉన్నా.. ప్రస్తుతం యాసంగి పంటలకు నీరు అందడం లేదు. వరిపంట పొట్ట దశకు చేరుతున్న సమయంలో కాల్వ నీరు రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. కాగా, వానాకాలం పంటల కోతలు పూర్తయ్యాక నీటిని వృథాగా వదిలిన అధికారులు.. ఇప్పుడు రైతులు యాసంగి వరి నాట్లు వేసిన తర్వాత నీటిని నిలిపివేయడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాల్వకు నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.



నీరు లేక వట్టిపోయిన సంగంబండ కుడి కాల్వ

## ఎమ్మెల్యే జగదీశ్వర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి



కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**మక్తల్:** రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్‌ను సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం బీఆర్ఎస్ నాయకులు మక్తల్ అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తుందన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ తీరును ఎండగడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వర్‌పై సస్పెన్షన్ విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యేపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మొగులప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు గవినోళ్ల నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆశిరెడ్డి, హన్మంతు, సుదర్శన్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, తిరుమల్లేష్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, శ్రావణ్‌కుమార్, సత్యనారాయణగౌడ్, అనిల్‌కుమార్, అంబ్రేష్, ఆనంద్, సూరి తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధికి సహకరించండి

**కోస్గిరూరల్:** మున్సిపాలిటీలో చేపట్టే అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోస్గి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వివిధ అభివృద్ధి పనులకు రూ. 353 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో మినీ ట్యాంక్‌బండ్, సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ సిస్టం, పార్కులు, డంపింగ్ యార్డులు, పట్టణ ముఖద్వార నిర్మాణాలు మొదలైనవి చేపట్టనున్నట్లు వివరించారు. రోడ్డు వెడల్పు, బాధితులకు పరిహారం చెల్లింపు కోసం రూ. 7కోట్లు మంజూరు కావడంతో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు రూ. 30లక్షలు ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి నివారణకు అమృత్‌జల్ పథకం నుంచి రూ. 12కోట్లు మంజూరయ్యాయన్నారు. బీసీ కాలనీలో 8లక్షల లీటర్లు, బాహర్‌పేటలో 5లక్షలు, పోతిరెడ్డిపల్లిలో 2లక్షల లీటర్ల సామర్థ్యంగల వాటర్ ట్యాంకులు నిర్మించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు పూర్తి సహకారం అందించాలని కమిషనర్ కోరారు. సమావేశంలో ఏఈ జ్ఞానేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాల్‌రాం ఉన్నారు.

## వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**నర్వ:** వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకులు కోరారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కలిసి వాల్మీకి మహర్షి చిత్రపటం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంపీ డీకే అరుణ పార్లమెంట్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘం నాయకులు నీరజ్, అయ్యన్న, ఎర్ర నర్సింహ, రామాంజనేయులు, మారుతి, మాజీ సర్పంచ్ వెంకటన్న పాల్గొన్నారు.




ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న వాల్మీకి బోయ సంఘం నాయకులు

### పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**కొత్తపల్లి/ధన్వాడ/మాగనూర్/దామరగిద్ద:** పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. కొత్తపల్లి మండలం పెద్దాపూర్, ధన్వాడ మండలం కంసాన్‌పల్లి, మాగనూర్ మండలం ఖైరంపల్లి, దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లి పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. క్యాతన్‌పల్లి పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో న్యాయవాది కాళప్ప, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశాల్లో హెచ్ఎంలు సత్యనారాయణ, ఆంజనేయరెడ్డి, బాలరాజు, వినోద్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు సాయమ్మ, మేఘన పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల ధర్నాను విజయవంతం చేయండి



ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

**నారాయణపేట:** అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17, 18 తేదీల్లో 48 గంటలపాటు జిల్లా కేంద్రంలో చేపట్టనున్న ధర్నా, వంటావార్పు కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం పిలుపునిచ్చారు. శనివారం ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ మొబైల్ సెంటర్స్, ఎన్‌ఈపీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. రెండు రోజులపాటు జరిగే వంటావార్పు, ధర్నా కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అందరూ పాల్గొంటున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు సుజాత, అనిత, సుమిత్ర, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### చిరుత దాడిలో దూడ మృతి

**ధన్వాడ:** చిరుత దాడిలో దూడ మృతిచెందిన ఘటన ధన్వాడ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ధన్వాడకు చెందిన రైతు చెట్టుకింది కథలప్ప తన పొలంలో శుక్రవారం సాయంత్రం పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో చిరుత దాడిచేసి ఓ దూడను చంపివేసింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారి మల్లేష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

### జీపీ కార్మికుల భిక్షాటన

**నారాయణపేట రూరల్:** పంచాయతీ కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించక పోవడాన్ని నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా నాయకుడు నర్సింహులు మాట్లాడుతూ.. గ్రామాల శుభ్రతకు పాటుపడుతున్న కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



## విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం అవసరం



దామరగిద్దలో ఏఐ బోధనా తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈఓ కృష్ణారెడ్డి



కృష్ణా మండలం కున్సీ పాఠశాలలో..

**నారాయణపేట ఎడ్యుకేషన్/దామరగిద్ద/కృష్ణా:** విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం ఎంతో అవసరమని.. ఇందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) దోహదపడుతుందని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం దామరగిద్ద సీపీఎస్ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ విద్య అందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అనంతరం క్యాతన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలోనూ కంప్యూటర్ విద్య బోధనను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ జీహెచ్ఎం అశోక్ కుమార్, హెచ్ఎం చందు జమాన్, చైర్మన్ బర్ల వెంకటమ్మ, భీమయ్యగౌడ్, ఈదప్ప, గోపాల్‌రావు, బసిరెడ్డి, అశోక్, శ్రీనివాస్‌శెట్టి, సత్యనారాయణ పాల్గొన్నారు.

■ కృష్ణా మండలం కున్సీ ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంఈఓ నిజాముద్దీన్ ప్రారంభించారు. ఏఐ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం శేఖర్ ఆధ్వర్యంలో కంప్యూటర్ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం శివరాజ్, మాజీ ఎంపీటీసీ రాంచందర్, అంజప్పగౌడ, పిట్టల్ సిద్ధప్ప, రాంచందర్, మ్యాకలి సురేశ్, కీరప్ప పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో ఏఐ తరగతులను ఎంఈఓ బాలాజీ ప్రారంభించారు. వెనకబడిన విద్యార్థులకు ఏఐ బోధన ఎంతో దోహదపడుతుందని తెలిపారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

**మరికల్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని కన్మనూర్ పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ అమలుపై ఆరా తీశారు. అనంతరం వంటగదితో పాటు బియ్యం, కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల భోజనానికి వినియోగిస్తున్న బియ్యంలో పురుగులు ఉండకుండా చూడాలని.. తాజా కూరగాయలు మాత్రమే వంటకు వినియోగించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.



బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

## పశ్చిమాద్రి విరక్త మఠంలో కంటి పరీక్షలు



కంటివైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్వామిజీ

**మాగనూర్:** మండలంలోని నేరడగంలో శ్రీసిద్ధలింగేశ్వర స్వామి మఠం ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం కంటివైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు భక్తులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సిద్ధలింగ మహాస్వామి మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర గల పశ్చిమాద్రి విరక్త మఠంలో ఇలాంటి పుణ్యకార్యాలు జరుపుకోవడం శుభ పరిణామమన్నారు. ఈ నెల 18 వరకు నిర్వహించే ఉత్సవాల్లో భక్తజనం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

**నారాయణపేట:** వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఏఎస్ఐ ఆంజనేయులు సూచించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండటంతో పాటు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి మితిమీరిన వేగంతో వాహనాలు నడపకూడదన్నారు. వాహనాలు నడిపే సమయంలో కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నారాయణ, హన్మంతు, సంతోష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు

## విద్యార్థుల కలల ప్రపంచం అదరహో..



రైతుగా..



సైనికుడిగా..



లాయర్‌గా..



కూలీగా..

**మరికల్:** భవిష్యత్‌లో తాము చేపట్టబోయే పదవుల్లో జీవించి అదరహో అనిపించారు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. మండలంలోని పస్పుల, పెద్దచింతకుంట ప్రాథమిక పాఠశాలల్లో శనివారం కెరీర్ చాయిస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ కల మేరకు వేషధారణతో ఆకట్టుకోవడంతో పాటు తమ మనోభావాలను పంచుకున్నారు. విద్యార్థులు కలలు కనడం సహజమని.. వాటిని నెరవేర్చుకున్నప్పుడే జీవితాలకు అర్థం ఉంటుందని ఉపాధ్యాయులు సూచించారు.

## కాన్షీరాం ఆశయాలు కొనసాగిద్దాం

**నారాయణపేట/మక్తల్/ఊట్కూరు/కోస్గి:** బహుజన రాజ్య మాంత్రికుడు, బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం ఆశయాలు కొనసాగిద్దామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొడిగెలి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో కాన్షీరాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో అణగారిన వర్గాలకు అధికారం దక్కకుండా ఆధిపత్య కుల రాజకీయ పార్టీలు నిత్యం బహుజనులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. బహుజనుల బతుకులు మారాలంటే ఆధిపత్య పార్టీలను తరమికొట్టాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమేశ్, హన్మంతు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

■ కాన్షీరాం జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జి పాలెం వెంకటయ్య కోరారు. మక్తల్‌లో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, జిల్లా కార్యదర్శి బండారి చంద్రశేఖర్, మల్లికార్జున్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

■ ఊట్కూరులో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మండల కన్వీనర్ గౌతమ్, నాయకులు ఆజమ్మ, శ్రీనివాస్, అశోక్, తరుణ్, రాజు, భాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందినప్పుడే సామాజిక, ఆర్థిక న్యాయం చేకూరుతుందని తెలంగాణ ప్రజా ఉద్యమనాయకుడు గౌరగాళ్ల కృష్ణమౌర్య అన్నారు. గుండుమాల్‌లో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివన్న, కృష్ణ, అంజి, వెంకట్, కృష్ణ, రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.